# కవిరాట్టు

కవి కడుపు నొప్పితో బాధపడుతున్నాడు; మూలుగుతున్నాడు; మెలికలు తిరిగి పోతున్నాడు.

ఏమిటంటే, కవికి అజీర్తి చేసిందన్నారు.

ప్రఖ్యాతి జాస్తిగా తిని అజీర్తి తెచ్చుకున్నాడు కవి.

ప్రఖ్యాతి అమితంగా తినరాదని కవికి వాళ్లమ్మ చెప్పలేదు! గబగబా మెక్కరాదని కూడా కవికి వాళ్లమ్మ చెప్పలేదు.

వాళ్లమ్మ చెప్పలేదు కనక, కవికి ప్రఖ్యాతి దొరికే చోటికల్లా వెళ్లి రెండు చేతులా అందిపుచ్చుకొని మరీ తిన్నాడు.

మర్యాదగా పిలిచి పీటవేసి కూర్చోబెట్టితే తప్ప ప్రఖ్యాతి తినటానికి వెళ్లరాదని కవికి వాళ్లమ్మ చెప్పలేదు. వాళ్లెంత పెడితే అంతే తినాలి గాని అడిగి పెట్టించుకోవటం మర్యాద కాదని కూడా కవికి వాళ్లమ్మ చెప్పలేదు.

అందుచేత కవి అత్యాచారంగా ప్రతి ఇంట్లోనూ జొరబడి బలవంతాన అడిగి ప్రఖ్యాతి పెట్టించుకున్నాడు.

కొందరు నిర్మొహమాటంగా, "మా ఇంట్లో ప్రఖ్యాతి లేదు, ఫో!" అని కవిని కసిరికొట్టారు.

మరికొందరు, "ప్రఖ్యాతిని మేము అడ్డమైన వాళ్లకు పెట్టం" అన్నారు.

"నువు మాకేం పెట్టావని నీకు మేం ప్రఖ్యాతి పెడతాం?" అన్నారు ఇంకా కొందరు.

"మీకేం కావాలంటే అది ఇస్తాను. నాకు మాత్రం ఇంత ప్రఖ్యాతి పెట్టండి!" అన్నాడు కవి.

"మాకు లంచం పెడతవా, దుర్మార్గుడా?" అన్నారు వాళ్లు. అంతేకాక వాళ్లు లోకంగారి ఇంటికిపోయి తలుపు తట్టి, "విన్నావా, లోకం? కవి మమ్మల్ని ప్రఖ్యాతి పెట్టమని అడిగాడు, మేం పెట్టం అంటే లంచం ఇవ్వొచ్చాడు!" అని చెప్పివచ్చారు.

"చాలా చెప్పకవి!" అని లోకం పెదిమవిరిచి మళ్లీ తలుపేసుకుంది.

* * * * *

"నువు ప్రఖ్యాతి జాస్తిగా తిని అజీర్తి తెచ్చుకున్నావు!" అన్నారు కవితో కవిమిత్రులు.

"నాకజీర్తా? నాకా అజీర్తి!" అన్నాడు, కవితోక తొక్కిన తాచల్లే లేస్తూ.

"నేను కడుపునిండా ప్రఖ్యాతి తిననేలేదు" అన్నాడు కవి.

"నేనింకా చాలా ప్రఖ్యాతి తిని హరాయించుకోగలను!" అన్నాడు కవి.

"నన్నసలు సగౌరవంగా పిలిచి తృప్తిగా ప్రఖ్యాతి పెట్టిన వెధవ ఎవడు?" అన్నాడు కవి.

"మరి నువ్వెందుకు మూలుగుతున్నావు - నీకు అజీర్తి చెయ్యకపోతే?" అన్నారు కవి మిత్రులు.

"ఎందుకట్టా మెలికలు తిరిగిపోతున్నావ?" అన్నారు కవిమిత్రులు.

"నేను మూలగటం లేదు, సంగీతం పాడుతున్నాను. మెలికలు తిరగటంలేదు. నృత్య చేస్తున్నాను. కళలో కొత్తదనం మీరు తెలుసుకోలేరు. మీరు నా స్నేహితులు కారు?" అన్నాడు కవి.

"మేము నీ స్నేహితులమే; నువ్వే మా స్నేహితుడివి కావు!" అని కవిమిత్రులు వెళ్లిపోయారు.

❀ ❀ ❀ ❀ ❀

ఒక సీసాలో విమర్శ పోసి కవిదగ్గరికి తెచ్చాడు విమర్శక వైద్యుడు.

"చూడటానికంత అసహ్యంగా ఉంది. అదేమిటీ?" అన్నాడు కవి.

"ఇది విమర్శ. దీన్ని తాగితే నీ అజీర్తి నెమ్మదిస్తుంది" అన్నాడు వైద్యుడు.

"నా కజీర్తి లేదు" అన్నాడు కవి.

"నేను వైద్యుణ్ని. నన్ను మోసపుచ్చలేవు!" అన్నాడు విమర్శకుడు.

"మందు తీసుకునే అజీర్తి ఉంటుంది; మందు అవసరం లేని అజీర్తి ఉంటుంది. నాది మందు అవసరంలేని అజీర్తి. నీకీ సూక్ష్మాలు తెలియవు. నువు కవివికావు!" అన్నాడు కవి.

"ఏ అజీర్తి అయినా లేకుండా ఉండటం మంచిది. నువ్వు కవివైతే అయినావు, వైద్యం కూడా తెలిసినట్టు నటించకు! నా మాట విని ఈ మందు పుచ్చుకో?" అన్నాడు వైద్యుడు.

కవి సీసా పుచ్చుకుని బిరడాతీసి వాసన చూశాడు. కవి తల గిర్రున తిరిగిపోయింది. వాంతి అయినంతపని జరిగింది.

"ఛీ, ఛీ! నాకీమందు వద్దు!" అన్నాడు కవి.

"వద్దకపోతే మానుతుందా ఏమిటి? బలవంతాన ఐనా ఇస్తాను. నన్నెట్లా ఆపగలవో చూస్తాను!" అన్నాడు వైద్యుడు.

మందు నోట్లోపడగానే కవికి పెద్దవాంతి అయింది. గిలగిలా తన్నుకున్నాడు కవి. అరిచాడు కవి. చిందులు తొక్కాడు కవి. విమర్శకుణ్ని అడ్డమైన తిట్లూ తిట్టాడు కవి.

కాని కవి కడుపు తాత్కాలికంగా ఖాళీ అయింది.

అట్లా కడుపు ఖాళీ కావటం ఆరోగ్యంగా తోచలేదు కవికి.

మళ్లీ దేశమంతా తిరిగి ప్రఖ్యాతి తినటం మొదలుపెట్టాడు కవి. మళ్లీ కవిపొట్ట పూటయింది. అట్లా ఉంటేనే బాగుందనుకున్నాడు కవి.

విమర్శ సీసాలు ఏ దుకాణంలో కనిపించినా హడలెత్తటం మొదలుపెట్టింది కవికి.

"ఆ సీసాలు నీకుకాదు. మరొకళ్లకి!" అన్నప్పుడు కూడా ఆరాటం తగ్గలేదు కవికి.

"పాపం ఆవి వాళ్లకివ్వండి. కవుల అజీర్తికి మందివ్వటం ధర్మంకాదు. అది కవితా కళకు అత్యాచారం!" అన్నాడు.

❀ ❀ ❀ ❀ ❀

వైద్యులింకా తన వెంటపడుతూనే ఉండటం చూసి "నేనుకూడా వైద్యుణ్నే!" అన్నాడు కవి.

తనకు వైద్యం తెలుసునని నిరూపించడానికి ఉపన్యాసాలివ్వసాగాడు కవి.

కవికూడా వైద్యుడే నన్నారు! కవిత్వమూ, విమర్శా రెండూ తెలియనివాళ్లు.

***ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942***
***యువ కార్యాలయం, తెనాలి***